# మాలతి కథ

కథ జీవితంలాగ వుండదు, జీవితం కథ మాదిరిగా కనిపించదు. కథలో పాత్రలకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, జీవితంలో వ్యక్తులకు వుండవు. జీవితంలో వున్న నొక్కుళ్ళు కథలో పెడితే, అది అట్టే ముందుకు సాగదు. కథలోవున్న స్తబ్ధత జీవితంలో వుంటానికి వీల్లేదు. కాలం కదిలిపోతుంది. జీవితంలో నలుగురికీ తెలియని విషయాలు, అందరూ తెలుసుకోలేని సంగతులు కథలో కనిపించచ్చు. కథకూడా జీవితం మాదిరే వుంటే, జీవితంమీద సామాన్యంగా కలిగే విసుగే కథ మీదకూడా కలుగుతుంది. అతివాస్తవికతకు చిహ్నం జీవితమనుకుంటే, వాస్తవికతకు దగ్గరగా రావటానికి ప్రయత్నిస్తుంది కథ. ఇట్లా వుంటుంది అని జీవితం చూపిస్తుంటే, యిట్లా యెందుకు వుఁడకూడదు అని కథ నిరూపిస్తుంది.

అయితే కథలు బాగా చదవటం అలవాటుపడిన మాలతి, ఓ కథ లాగ తన జీవితాన్ని మలచుకుందామని ప్రయత్నం చేసింది. కాని చిట్ట చివరకు ఆమె జీవితమే ఒక కథలాగ తయారయింది.

దానికి కారణాలేమిటో ఆమే చెపుతోంది.

ప్రమిదలో నూనెపోసి దీపం వెలిగించటం, సామాన్యమైన విషయమే. అయినా ఆ విధంగా ఎవరు వెలిగిస్తున్నప్పటికి, ఆ దీపానికి, నా

జీవితానికి ఏదో గట్టి సంబంధం వుందని అనిపిస్తూ వుంటుంది. అందులో మా వదిన వెలిగిస్తుంటే, ఒక జ్యోతి వెలుగుతున్నట్టూ ఓ జీవితాన్ని నిల బెట్టుతున్నట్టూ అనిపిస్తుంది. కార్తీక మాసం వచ్చిందంటే, మా వదిన, నిత్యమూ దీపం పెడుతూనే వుంటుంది. ప్రమిదలో నూనె పోసింది; వత్తిని పైకిలాగి, వెలుగును ప్రసారించింది. గాలితాకిడికి కురుచయి పోతున్న దీపానికి రెండు చేతులు అడ్డంపెట్టి, కొండెక్క కుండా కాపాడింది. అది చూస్తుంటే నా వళ్ళు ఝల్లుమంది. నేను పడిపోయే స్థితిలో వున్నప్పుడు మా వదిన నన్ను యెంతో ఆదరించి, ధైర్యానిచ్చి, మళ్ళీ మనిషిగా నిలబెట్టింది సాహసించి, నన్ను అక్షణాన కాపాడింది, మా అన్నయ్యే అయినా, వదిన ప్రేమా, సహనం లేకపోతే, నా జీవితం యే విధంగా వుండేదో వూహించటం కష్టం. ఏమైనాగాని నా దృక్పథంలో గొప్ప మార్పును తీసుకువచ్చారు యిద్దరూ కలిసి. టూకీగా జరిగిన విష యాలు చెపుతా. తీరా చూస్తే యిది సర్వ సాధారణంగా జరిగే విషయం గానే కనిపిస్తుంది. నిజంగా సాధారణమైన విషయమే కూడా! అయినా అప్పట్లో నా మనోభావాలు, ఓ వయస్సులో ఆడదాని అసహాయత, ఏ విధంగా రూపొందినాయో, ఎంతటి అఘాయిత్యానికి కూడా పాల్పడాలిసి వచ్చిందో చెపితే, యిప్పటికీ నన్ను వెంటాడే పిరికితనం. మనో వేద నలకు అర్థం వుందేమో, నేనే మళ్ళీ ఆలోచించుకోవటానికి అవకాశం వుంటుందేమో!

మాది పెద్ద కుటుంబం. మా అన్నయ్య తర్వాత నేను. నాకు నలుగురు చెల్లెళ్ళున్నారు, ముగ్గురు తమ్ములున్నారు. అమ్మా, నాన్న సరేసరి! పది పన్నెండేళ్ళదాక ఏంచేశారో, ఏం పెట్టారో నాకేం గుర్తు లేదు. సంవత్సరాదినాడు నాకు బాగా జ్ఞాపకం. 'యిది వేసుకో అమ్మా!' అంటూ అమ్మ పల్లెపమిట నా కిచ్చింది. బిత్తరపోయి ఓ

క్షణం చూశా. ఇట్టే గదిలోకి వెళ్ళి అద్దంముందు నిలబడి పమిట సర్దుకున్నా. నా జీవితంలో ఆనాడు ఏదో పెద్దమార్పు వచ్చినట్టు అనిపించింది. తెలిసీతెలియని ఆలోచనలతో, ఊహలతో ఉక్కిరిబిక్కిరయిపోయా. ఎవర్ని అడగటానికీ బిడియం. ఏదైనా కొత్తే వింత ; నాలుగు రోజులయ్యేటప్పటికి అదే పాతబడిపోయింది. కాని అప్పటినుంచీ, నేనూ ఒక మనిషేననీ, నేనంటూ వున్నానని నలుగురూ అనుకోవాలనీ వుండేది.

నన్ను, చిన్నపిల్ల దానికేం తెలుసు అని మా అమ్మ యే విషయంలో అన్నప్పటికీ, నాకు చెడ్డ ఉక్రోషం వచ్చేది. కోపం వచ్చేది. ఇప్పుడనిపిస్తుంది యెందుకో అంత కోపం. మా అమ్మకు నేను చిన్నపిల్లనేగా ! అట్లానే కొన్నాళ్ళు గడిచిపోయినాయి. మెట్రిక్ పరీక్షకు వెళ్ళాం. నాకు పదహారేళ్ళు నిండటం ఆ యేడే ; అప్పటి కింకా బాగా పెద్దదాన్నయ్యా ననుకున్నా. మా అన్నయ్య మాదిరిగా నేనూ వుండాలని, ఆ విధంగానే రికామీగానూ, హాయిగానూ, చదువుకుంటూ కాలం గడిపెయ్యాలని వుండేది. కాని మా అమ్మ నన్ను ఒక్క క్షణం కూర్చోనిచ్చేదికాదు. ఏదో పనికి పిలుస్తూనే వుంటం, దాంతో నాకు బాగా చిరాకు పుట్టేది. నే నేమన్నా కనక అంటేసరి, మా అమ్మ ఇంతెత్తున నా మీదకు లేచేది. ఆడపిల్లవమ్మా, అణిగి మణిగి వుండాలి ; అంత పొగరుమోతుతనం పనికిరాదు. ఓర్పూ సహనం ఆడదానికి రక్ష. ఇప్పుడు నా మీద కాబట్టి సరిపోయింది. రేపు అత్తారింట్లో అవుతే అని ప్రశ్నవేసి ఊరుకునేది.

ఇప్పుడు నా వయస్సు ముప్పయేళ్ళు. మా అమ్మ ఆనాడు అన్న మాటలు యెంతవరకు అర్థం చేసుకోవాలో యే విధంగా సమన్వయించుకోవాలో యీనాడు నాకు కొంతవరకు తెలుసనుకుంటా ; కాని

మనవాళ్ళు లేతవయసులో వున్నప్పుడే ఆడపిల్లల్ని యీ విధంగా దండిస్తూ, వున్న మతికూడా పోగొట్టేస్తూ వుంటారు. ధైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ కూడా బెదరగొట్టేస్తున్నారేమో అనిపిస్తుంది.

ఏమయినా జరిగిందది. మెట్రిక్ ప్యాసయ్యాను. పై చదువు చదివించటం కోసం పెద్ద గొడవయి పోయింది.

మా అమ్మా నాన్నా, నా చదువును గురించి, నా భవిష్యత్తును గురించి సాగించిన చర్చలు యిప్పుడు తలుచుకుంటుంటే, చెడ నవ్వొస్తుంది. ఒకరి భవిష్యత్తుకు యింకోరు కర్తలు ఎట్లా అవుతారో, యిప్పటికీ నా కర్థంగాని విషయం. మొత్తంమీద నా చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టారు. కాని ఇప్పటి కాలం ఆడపిల్లలాగా నేను అంతగా బాధపడ లేదు నా కిప్పుడనిపిస్తుంది. నాకే కనక చదువు చెప్పిస్తే, ఆ ఇంట్లో అంత బండ చాకిరీ చేసేదెవరూ! పైగా నాకు పిల్లలంటే మొదటినుంచీ ప్రాణం. మరి ఆ మురిపెం తీరేదెట్లా! పసిపిల్లల్ని ఎత్తుకుని ముద్దులాడే అవకాశం ఆ ధనికుని పుట్టింట్లోనే దొరికింది!

మా అమ్మ అని చెప్పటంలేదు. ఆమె సహనం, ఓర్పూ యింక యే యే ఆడదానికికూడా వుండవు! తెల్లారి లేచినప్పటినుంచీ, తలవంచుకుని ఎంతపనైనా చేసుకుని పోతుంది. విసుక్కోదు, కసురుకోదు, ఉన్నదాంతోనే పొదింక సరిపెడుతుంది, అయితే ఆ యింట్లో ఎంత తెచ్చినా సరిపోదు. ఎంత చాకిరీ చేసినా చెయ్యాల్సిందింకా ఎంతో వున్నట్టే కనిపించేది. కాని ఆమెను కాస్త మెప్పుగా మాట్లాడాలని వుండేది! మా నాన్న మాత్రం యెప్పుడుకూడా ఒక్క సానుభూతి మాట అన్నట్టు నేను వినలేదు. ఆడది, తన సర్వస్వాన్నీ ధారపోసి, అహర్నిశలూ, భర్తా, బిడ్డలకోసం ఎంత త్యాగాన్నైనా చెయ్యటానికి సిద్ధపడుతూ వుంటుంది. కాస్త సానుభూతి, మెప్పూ కోరటం అసహజం

కాదనుకుంటా? ఏదైనా సహించొచ్చేమోగాని తృణీకారం, నిర్లక్ష్యం యిముడ్చుకోవటం చెడ్డ కష్టం. కాని మా అమ్మ, వాటినికూడా దిగ మింగి, ఎంతో శాంతంగా కనిపించేది. మా నాన్నంటే, మొదటినుంచీ కూడా మాకు భయానికి మారుపేరుగానే కనిపించేవాడు. మా అమ్మంటే నా కెంతో జాలీ ప్రేమాను. ఆమెను చూస్తుంటే కడుపు తరుక్కు పోతూవుండేది. ఆమె మీదకూడా నాకు ఓ సమయంలో ఏవగింపూ, విసుగూ కలిగింది. ఇవ్వాళ నేను చాలా సిగ్గుపడుతున్నా, అట్లా అను కున్నందుకు. అయితే నా విసుక్కు బలమైన కారణాలు లేవని మాత్రం నేను అనలేను. ఏ పరిస్థితుల్లో అనుకున్నానో చెపుతా:

మా అమ్మ చివరి పిల్లను కడుపుతోంది. ఆ యేడాదే మా అమ్మమ్మ చచ్చిపోయింది. మా యింట్లోనే వుండిపోయాము. ఇంట్లో అందరికీ రోగాలూ, నెప్పులూ, డాక్టరు ప్రతినిత్యమూ మా యింటికి వస్తూవుండేవాడు. మా అమ్మ లేచీలేవకా అవస్థపడుతూ వుండేది. నెలలు వచ్చినాయి. బరువు లెత్తకూడదు, ఎక్కువ శ్రమ పడకూడదు అని డాక్టరు సలహా ఇంకా మిగిలింది నేను. ఆ యింటిల్లిపాదికీ చాకిరీ చెయ్యటానికి. అలాంటి పరిస్థితుల్లోకూడా, వేళకు ఏదీ ఆలస్యమయినా, మా నాన్న విసుక్కునేవాడు. పద్దెనిమిదేళ్ళ ఆడపిల్లకు యేమీ తెలీదను కోవటం, నిజాన్ని దాచటమే అవుతుంది. మరి నా మనస్సెట్లా వుండాలి! మా అమ్మమీద చెడ్డ అసహ్యం. ఏవగింపూ కలిగినాయి. మా నాన్న మీద చెడ్డ కోపం వచ్చింది. ఇంతమంది పిల్లలేమిటీ అని నా మనస్సులో రకరకాల ఆలోచనలు వచ్చినాయి. మా రాధ పుట్టింది. ఇంకా బాగా కళ్ళు తెరవలేదు. చేతులూ వేళ్ళూ ఆడిస్తోంది. చిన్న నోరుతో యిస్తే ఆవలిస్తోంది. చేతుల్లోకి తీసుకున్నా, ఇప్పుడులాగా వుంటుంది. నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి. పెద్దవాళ్ళు చేసే పనులకు పిల్లలు

యెంతవరకూ బాధ్యులవుతారో నా కిప్పటికీ తెలియదు. మా విషయం యింత బట్టబయలుగా చెప్పుకోవటం యిష్టంలేదు. కాని మా కుటుంబం పెద్దదవటంవలన, ఎన్నో అవకాశాలు, కనీసపు సరదాలు పోగొట్టు కున్నామనే చెప్పాలి. ఇదంతా దైవ చిత్రమని వూరుకుంటా! మా అన్నయ్య కన్నీ తెలుసు. పైకి ఒక్కటీ అనేవాడుకాదు. లోపల యేమేమి బాధపడేవాడో యెవ్వరికీ తెలీదు. బి. ఏ. ప్యాసయినట్లు తెలిసింది. ఇంట్లో యెవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో నా కనిపించింది. అన్నయ్య నాకూ్కడా మార్గదర్శకుడయ్యాడా అని.

ఈ పిల్లలతో సతమతమవుతూ వుంటం. యింకో కాలక్షేపం లేక పోవటం, నాకు విసుగుపుట్టిపోయింది. అప్పటినుంచే పుస్తకాలు చద వటం మొదలుపెట్టా సీరియస్‌గా. కనిపించిన నవలలు, కథల పుస్త కాలు యెన్ని చదివానో అంతులేదు. ఒక్కొక్కప్పుడు, యింట్లో బాగా పనున్నాకూడా లైబ్రరీలో కెళ్ళి కూర్చునేదాన్ని. ఎన్నో కొత్త విష యాలు తెలుసుకున్నట్లనిపించింది. ప్రేమ కథలు యెక్కువ. నా స్నేహితురాలు ప్రభావతి, బలే చలాకీపిల్ల. తమాషాగా మాట్లాడుతూ నవ్విస్తూ వుండేది. మగవాళ్ళను గురించిన విషయాలు బోలెడెన్ని చెపుతూ వుండేది. నిజం చెప్పొద్దూ: నాకూ వింటానికి సరదాగానే వుండేది! మగ పిల్లలతో మాట్లాడటమంటే మంచి ఉత్సాహంగా వుండేది. క్రమ క్రమంగా నాకు తెలీకండానే నాలో కొత్త కొత్త అభి ప్రాయాలు ఎన్నో ప్రవేశించినాయి. పాత ఆలోచనలు పారిపోయి నాయి. అమ్మా, నాన్నకంటెకూడా నా సంగతి నేనే బాగా చూసుకో గలననే ధైర్యం వచ్చేసింది. స్వతంత్రంగా ఆలోచించటం, వాళ్ళు యే మాటన్నా, పెద్దవాళ్ళు అట్లా అంటూనే వుంటార్లే అనే నిర్లక్ష్యం బాగా యేర్పడింది. ఈ ఆలోచనల్లోనే నా జీవితం మలుపు తిరిగింది.

ఇప్పుడు తాపీగా ఆలోచించుకున్నా. పెద్దవాళ్ళ ప్రవర్తన, పిల్లల మనస్తత్వంమీద యెక్కువ ప్రభావం పడుతుందేమో అనిపిస్తుంది. ఒక పెంపకంలోనేకాదు, మాటతీరులోనూ, చేసే పనుల్లోనూ, ప్రవర్తించే తరహాలోనూ, అన్నింట్లోనూ కూడా పెద్దవాళ్ళు చిన్న పిల్లల మనస్తత్వాలను ఆకళింపు చేసుకుంటూ వ్యవహరించరేమో అనిపిస్తుంది. వాళ్ళను అలక్ష్యం చేస్తున్నారనే భావం. వాళ్ళ మనస్సుల్లో ప్రవేశించకుండా చూడాలిసిన బాధ్యతకూడా పెద్దవాళ్ళమీదే వుందనిపిస్తుంది. నాకా 'పెద్దరికం' యింకా రాలేదు. రానప్పుడు యితరులను గురించి, ఏమనుకున్నా ఏం లాభం! ఆ సమయం వచ్చినప్పుడు మాత్రం, నేనెల్లా వుంటానో యిప్పుడు చెప్పుకోవటం అనవసరం.

నాకు బాగా స్వేచ్ఛ వచ్చిందనుకునప్పటినుంచీ, సాయంత్రంపూట పార్కుకు వెళుతూ వుంటం, వీలైనప్పుడు సినీమాలు చూస్తూ వుంటం. అమ్మేదైనా ప్రశ్నవేస్తే, నా సంగతి నాకు తెలుసులే అని ఖచ్చితంగా సమాధానం చెప్పటం మామూలయిపోయింది. ఓ నవల పట్టుకుని కూర్చున్నా. దాంట్లో మంగ, శశిరేఖలు యించుమించు నా మాదిరిగానే వున్నారు. అప్పుడు నా ఆలోచనంతా వీళ్ళమీదలేదు. ఆ నవలలో మధుమీదా, అతనితో వాళ్ళు జరిపిన సంభాషణలూ, అతను చెప్పిన సమాధానాలూ, అన్నీ నోటికి పట్టినాయి. అతనిలాంటి మనిషి వస్తే బాగుండు ననిపించింది. అప్పటికే పార్కులో జనం పల్చబడిపోతున్నారు. దీపాలు అక్కడక్క వెలుగుతున్నాయి. వెనకాల్నుంచి ఓ వ్యక్తి వస్తున్నాడు నా వైపుకే. ఓరకంటితో చూశా. నా ఆవేదనకు, ఆరాటానికి మంచి సమాధానం అనుకున్నా. అతనితో యేదైనా మాట్లాడాలనిపించిందికూడా. కాని అతనేవచ్చి పలకరించాడు. నాకు అంతగా పరిచయం లేకపోయినా కొత్త మొహమేమీ కాదు. పార్కులో ఒక

రొక్కరం చాలా రోజులబట్టీ చూసుకుంటూనే వున్నాం. అతని పేరు మధుసూధనరావని చెప్పేటప్పటికి, నా ఒళ్ళు జలదరించింది. నేను కోరుకోవటం, మధు రావటం బాగానే వుందనుకున్నా. చాలా సేపటి దాకా అవీ యివీ మాట్లాడుకున్నాం. ఆనాడు నా అనుభూతిని వర్ణించ టానికి యిప్పటికే నా దగ్గర మాటలులేవు. రోజులు దొర్లిపోవటంతో అతను, పరాయివాడల్లా, ప్రాణస్నేహితుడయ్యాడు. అతనిలోవున్న యెవ్వరికీ కనిపించని ఆకర్షణ, నన్ను బాగా కట్టేసింది. ఇద్దరంకూడా చాలా సన్నిహితుల మయినాం.

ఇంక నా ఆలోచనకు ఓ స్థిరత్వం ఏర్పడింది. రాసిపెట్టటం, విధినిర్ణయం, వీటికి అర్థాలు యిప్పుడు తెలుస్తాన్నాయి అనుకున్నా. ఒక రొక్కరం గాఢంగా ప్రేమించుకున్నామని కూడా నిర్ణయాలు చేసుకున్నాం ఈ బంధం ఈనాటిది కాదనీ భగవంతుడు తప్ప, మా యిద్దర్ని యింకె వ్వరూ వేరు చెయ్యలేరనీకూడా తీర్మానించుకున్నాం. ఇలాంటి నిర్ణ యాలు ఒక్కనాడు చేసుకున్నవికావు. నెలల తరబడి చర్చలు జరిపిన తర్వాత ఒకరి నొకరం పూర్తిగా అర్థం చేసుకున్నామని అనుకున్న తర్వాత చేసుకున్న నిర్ణయాలు. నాలో మార్పు మా అమ్మ కనిపెట్టి నట్టుంది. నన్ను చాలాసార్లు అడిగింది. నే నేమీ చెప్పలేదు. ఈ మా సంబంధాన్ని మా పెద్దవాళ్ళు ఒప్పుకోరని మాకు పూర్తిగా తెలుసు. ఆ కారణాలు ఇప్పుడు అప్రస్తుతం? ఆరిందాల్లాగా యిద్దరం ఆలో చించాం. ప్రమాణాలు చేసుకున్నాం. అప్పట్లో నా ఉద్దేశం, అతను నన్ను గాఢంగా ప్రేమించాడు; పెళ్ళి చేసుకుంటాడు; మా అమ్మ, నాన్నకు భారం తప్పిపోతుంది; నాకూ ఓ యిల్లంటూ ఏర్పడుతుంది; నా మోజు తీరుతుంది; పిల్లలు కలుగుతారు; ఇంతపెద్ద కుటుంబంలో నా మాటే ఆలోచించే అవకాశమే లేదు; అందరితోపాటూ నేను; ఇప్పుడు

నాకు పెళ్ళి అయితే పెద్ద అండ ఏర్పడుతుంది? స్వతహాగా అన్నీ చక్కదిద్దుకోగల స్తోమత యేర్పడుతుంది: జీవితంలో స్థిరపడటం, కొత్తరకం జీవితంలో ప్రవేశించటం. ఏ ఆడదైనా సహజంగా కోరుకునేదే! ఇవే నా ఆలోచనలు. అప్పటికీ యిప్పటికీ వీటిలో తప్పేమిటో నాకు తెలియలేదు. కాని పెళ్ళికి ముఖ్యం ప్రేమ ఒక్కటే కాదేమో! దాంతోపాటు ధైర్యం, ఆత్మ విశ్వాసం, సానుభూతి, జాలి, కరుణా యివన్నీ వుండాలేమో! నిజమైన ప్రేమలో యివన్నీకూడా యిమిడే వుండవచ్చుకూడా! ఏమయినా ఆడది ప్రేమించినట్టు మగవాడు ప్రేమించలేడేమో అనిపిస్తుంది. అందువల్లనే జీవిత సహచరుడ్ని యెన్నుకోవటంలో, అతని ప్రేమకంటే దాన్ని అధిగమించే అతని అశక్తతేమిటో చూడాలనుకుంటా! ఆనాడు నేనుకున్నదల్లా, మా యిద్దరికీ పెళ్ళయిపోతే, యిక్కడ యెవ్వరూ హర్షించకపోయినా, పావురాల్లాగా యెక్కడికో యెగిరిపోదామనుకున్నాం. పెళ్ళవటమే అతిముఖ్య మనుకున్నా. నిజంగా యిప్పుడాలోచిస్తే, పెళ్ళి కేవలం ఒక మెట్టు మాత్రమే! అదొక తోటలాంటిదని యెక్కడో చదివినట్టుకూడా గుర్తు. ఎంతో పోషణగా పెంచాలి. అప్పుడే పూలు పూసి వికసిస్తుందది. ఇదెంతవరకు నిజమో నే చెప్పలేను. అప్పట్లో పాలపొంగులాగ వచ్చిన ప్రేమాతిశయాన్ని, లోతుగా కనుక్కోలేక, శాశ్వత బంధానికి చిహ్నమని అనుకున్నా. ఇప్పుడవుతే అతనిది ప్రేమనికూడా అనలేను. అదోరకపు ఉద్రేకం కావచ్చు.

ఏడాది పొడుగునా మథనలోపడి నలిబిలయిపోయినా, నా నోటితో నేను చెప్పకపోయినా, మా యింట్లో అందరికీ తెలిసింది. మా ఇంట్లోనేమిటి, ఊరందరికీ తెలిసింది. కాని నాలో పాతుకుపోయిన దృఢ విశ్వాసం మాత్రం చలించలేదు. కాని చివరికి, అతను చేసిన వాగ్దానాలన్నీ ఒట్టివయిపోయినాయి. మా యిద్దరి సన్నిహితత్వం మాత్రం

మిగిలిపోయింది. అతను పెద్దవాళ్ళమాట విని, బుద్ధిమంతుడనిపించు కున్నాడు. స్కాలర్‌షిప్‌మీద విదేశాలకు పెద్ద చదువుకని వెళ్ళిపోయాడు. నే నేమో అమ్మా నాన్నకు కళంకం తెచ్చిన అల్లరి ఆడపిల్లనయి పోయాను. నలుగురి నోట్లోనూ యిదే మాట; అవమానంతో కృశించి పోతూ, తలెత్తుకు తిరగటానికి వీల్లేక, చాటు మాటుగా వుండిపోవలసిన పరిస్థితి యేర్పడింది. చేసిన తప్పు లేకపోయినా, నాకింత కఠినశిక్ష యేమిటా అనిపించింది. ఒక్కొక్క రోజు గడవటం పెద్ద ప్రళయంగా వుండేది; తమ్ములూ, చెల్లెళ్ళూ కూడా నన్ను చులకనగా చూడటం మొదలు పెట్టారు. ఎట్లా గడిపానో యేమో యిప్పుడు తలుచుకుంటే భయమేస్తుంది.

ఆ రెండేళ్ళలోనూ ఎన్ని అపవాదులు పడ్డానో, ఎన్ని నిందలు పడ్డానో అంతులేదు. ఉన్న ఆత్మ విశ్వాసం కాస్తా కదిలిపోయింది. ఇంకా పిచ్చిపిచ్చి ఆలోచనలు రావటం మొదలుపెట్టినాయి. ఏ మాట వచ్చినాసరే, యింటా బయటకూడా 'నీ మూలానే' అనటం బాగా నేర్చుకున్నారు. ఇంత తాకిడిని తట్టుకోలేక పోయాను. వీళ్ళంతా కలిసి బ్రతికివుండగానే నన్ను చంపెయ్యటానికి పూనుకున్నారా అనిపించింది. ఆ అవకాశం యింకోళ్ళకు యివ్వటం యెందుకని ఆలోచన చెలరేగింది. ఇదే అసమర్థతకు ఆఖరి చిహ్నం. కాని దానికి యెంతో ధైర్యం కావాలి. అదృష్టవశాత్తు అలాంటి ధైర్యం అప్పట్లో నాకున్నది.

సాయంత్ర మయింది. నక్షత్రాలు మిణుకు మిణుకు మంటు న్నాయి. మా యింట్లోకూడా దీపాలు పెట్టారు. నేను గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నా. ఇరవైయేళ్ల జీవితం ఆనాటితో సమాప్తం కావాలి; నేను నా ప్రయత్నంలో వున్నా. వాకిట్లో బండి చప్పుడయింది. కిటికీ తలుపులు కాస్తంత తెరిచి చూశా. అన్నయ్య బండి దిగుతున్నాడు.

వెనకాలే ఓ అమ్మాయికూడా దిగింది. నాలో మళ్ళా ఆరిపోబోతున్న జ్యోతి వెలుగుతున్నట్లనిపించింది. కళ్ళు పెద్దవయినాయి.

అమాంతం గది తలుపులు బార్లగా తెరిచాను. నిబ్బరంగా వాకిటి గుమ్మం దగ్గరకొచ్చి నిలబడ్డా. వచ్చావా నాయనా అంటూ యెంతో దుఃఖంతో, మా అమ్మ అన్నయ్యను చేరదీసింది. ఈ అమ్మాయెవ్వరన్నట్టు, మా అమ్మ కళ్ళతోనే ప్రశ్నించింది. సమాధానంకోసం ఆగకుండానే విషయం తెలుసుకుంది. క్షణకాలంపాటు అమ్మ బొమ్మలాగ నిలబడిపోయింది.

ఆ రాత్రి మా కెవ్వరికీ నిద్రలు లేవు. ఒకరి విషయం ఒకరికి చెప్పుకోవటంతోనే సరిపోయింది. మా నాన్న మా దగ్గరకు వచ్చిగాని, అన్నయ్యను పలకరించటంగాని చెయ్యలేదు. పైగా, అన్నయ్య నాన్న గది వైపుకు వెళుతుంటే, తలుపులు మూశేశాడు. మర్నాడే మా అన్నయ్య ప్రయాణం కట్టాడు. మాలతీ నువ్వు కూడా బండి యెక్కు అన్నాడు నాతో. ఎక్కడికిరా అంటూ అమ్మ అరిచింది. మాతో తీసుకు వెళుతున్నా అన్నాడు ముక్తసరిగా. బిక్కుబిక్కుమంటూ, ఒక్కొక్క అడుగే వేస్తూ, బండీలో మా వదిన పక్కనే కూర్చున్నా. మా అమ్మ ఆదుర్దాగా, నాన్న దగ్గరకు వెళ్ళి ఏమండీ! ఆపండీ అంటూ ఆవేదనపడింది. నాకు దుఃఖము పొర్లుకొచ్చింది.

పోనీ పీడ విరగడయిపోతుంది. అన్నాడు మా నాన్న గట్టిగా అందరూ వినేటట్లే.

మా అన్నయ్యా, వదినా ఆదరాభిమానాలతో, మళ్ళీ ఆత్మ విశ్వాసం తెచ్చుకున్నా. నా మూలంగా, వాళ్లు యెన్నో మాటలు పడాలసి వచ్చినా లెక్కచెయ్యలేదు. ఇద్దరూకూడా నాకు యెంతో అండగా

నిల్చారు. మళ్ళీ తలెత్తుకుని తిరగటం మొదలెట్టా. ఎంతో ఉత్సాహం గానూ వుంటున్నా. కొన్నాళ్ళకు ఆ ఘడియ రానేవచ్చింది. నా పెళ్ళయి పోయింది. ఆయన నన్నెంతో ప్రేమగానూ, అభిమానంగానూ చూస్తున్నారు. ఆత్మాభిమానానికి తగిన గౌరవం యిచ్చే ఔదార్యం ఆయనలో వుంది. నాకు తెలియకుండా, నాలో ఒదిగియున్న మంచి మంచి గుణాలేమిటో ఆయన కనిపెట్టేశారు. ఒకర్నొకరు పూర్తిగా అర్థం చేసుకుని జీవితాన్ని సాగించుకుంటున్నాం. ఆయన ఆదరణ, ప్రేమ నన్ను ఒక్కొక్కప్పుడు దహించివేస్తూ వుంటాయి. ఆయన దగ్గర ఒక రహస్యాన్ని దాచానే అనే ఆవేదన నన్నెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది. జరిగిన పొరపాటును ఆయనకు చెప్పే ధైర్యం నాలోలేదు. ఒకవేళ చెప్పినప్పటికీ, ఆయన నన్ను అపార్థం చేసుకోరనే నమ్మకం మాత్రం నాకుంది.

నిజంగా నేను చాలా అదృష్టవంతురాల్ని. మా అన్నయ్యా, మావారిలాంటివాళ్ళూ అందరికీ దొరకటం సులభంకాదు. నా తప్పును క్షమించి, నన్ను మంచి మార్గంలో పెట్టాడు మా అన్నయ్య. నాలో వున్న మంచిగుణాల్నే తీసుకుంటూ నామీద ప్రేమ వర్షం కురిపిస్తున్నారు మా వారు. ఒకవేళ యిలాంటివాళ్ళే ఎవరికైన దొరికినప్పటికీ, జీవితమంతా చెయ్యని నేరంతో బాధపడుతూ వుంటం భరింపరానిది. అంతకంటే యే శిక్ష వేసినా హాయిగా అనుభవించవచ్చు.

( యువ, అక్టోబరు 1965 )